# సాక్షి
## వైఎస్సార్ జిల్లా

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025




**కూలిన బతుకులు**
రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు వారు. కూలి కాస్త ఎక్కువగా వస్తుందన్న ఆశతో జిల్లాదాటి వచ్చిన వారి జీవితాలు మధ్యలో ముగిసిపోయాయి. -8లో



**జాతీయ స్థాయి పోటీలకు 'భారతి' విద్యార్థులు**
భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ లోని డీఏవీ భారతి విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. -8లో

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
36.4/26.4
జిల్లాలో మంగళవారం 26.4 - 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

పులివెందులలో అన్నదాత పోరులో వైఎస్సార్ సీపీనేత సతీష్‌రెడ్డి,పార్టీ నాయకులు



బద్వేలులో అన్నదాత పోరు ర్యాలీలో ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి తదితరులు



జమ్మలమడుగు: ఏవోకు వినతిపత్రమిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తదితరులు



# కర్షకుడి కన్నెర్ర!

పంట సాగు చేద్దామంటే
సమయానికి చినుకు రాలదు..
పంటకు సత్తువ వేద్దామంటే
బస్తా ఎరువు దొరకదు..
పంట చేతికొస్తే మద్దతు ధర దక్కదు..
ఇదేంటని అడుగుదామంటే
ప్రభుత్వం పలకదు...

కొండలా పెరుగుతున్న అప్పులు..
గుండెలపై బరువెక్కుతుంటే..
చేతికొచ్చిన పంట చేలోనే కుళ్లి
పోతుంటే.. రైతన్న కంటి చెరువు
కట్ట తెగక ఏమవుతుంది..
కడుపుమండి 'కూటమి'పై
తిరగబడక ఏముంది...
మనసులేని.. చేతగాని నేతల తీరుపై
దునుమాడితే తప్పెలా అవుతుంది!



కర్షకలోకం కన్నెర్ర చేయడంతో ఆర్డీవో కార్యాలయాలు దద్దరిల్లాయి.. కూటమి ప్రభుత్వ కుట్రలు పటాపంచలయ్యాయి.. ఖాకీల ఆంక్షల సంకెళ్లు తెగిపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ నిర్వహించిన అన్నదాత పోరు.. కూటమికి చెర్నాకోల దెబ్బలా చురుక్కుమంది.

- యూరియా కోసం.. మద్దతు ధర కోసం రోడ్డెక్కిన రైతన్నలు
- ప్రజల మద్దతుతో కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- 'అన్నదాత పోరు'కు కూటమి అడుగడుగునా ఆటంకాలు
- జిల్లా వ్యాప్తంగా కొనసాగిన వైఎస్సార్‌సీపీ ఆందోళన





కమలాపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు..చిత్రంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, నరేన్ తదితరులు.. పోస్టర్‌తో రైతు

సాక్షి ప్రతినిధి, కడప: వ్యవసాయం చేస్తున్న రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. ఉల్లి రైతు గోడు పట్టించుకోలేదు. చీని రైతు ఆవేదన గాలికి వదిలేశారు. చివరికి పంటకు ఎరువుగా వాడుకునే యూరియా కూడా రైతులకు అందించలేని దుస్థితిలో కూటమి సర్కార్ ఉంది. పైగా ప్రజల పక్షమే ఏజెండాగా అన్నదాత పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట చేస్తే కూటమి సర్కార్ కుట్రలు చేసింది. రైతు పోరు నీరుగార్చేందుకు విశ్వయత్నం చేసింది. పోలీసులతో అనుమతులు లేవంటూ నేతలందరికీ నోటీసులు జారీ చేసింది. రైతుల కోసం ప్రజల మద్దతుతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. పోలీసుల ఆంక్షలు ఛేదించుకొని జిల్లా వ్యాప్తంగా రైతు పోరు విజయవంతం చేశారు. మంగళవారం రైతు పోరు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోనూ కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా శ్రేణులు ఉత్సాహంతో రెవెన్యూ డివిజన్ కేంద్రానికి పరిమితం కాకుండా నియోజకవర్గ స్థాయిలో చేపట్టింది. పోలీసుల ఆంక్షలు, సర్కార్ కుట్రలు ఛేదించుకొని రైతుల పక్షాన నినదించింది.

### 16 నెలల కాలంలో ఎంత తేడా...

వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులు ధీమాగా ఉండేవారు. ఎరువులు వీధిలోనే కొలువుదీరిన రైతు భరోసా కేంద్రాల్లోనే దొరికేవి. ఇక పంటకు మద్దతు ధర అందేది. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పరిస్థితి తలకిందులైంది. గణనీయంగా రైతుల పంటల ఉత్పత్తులకు రేట్లు పడిపోయాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో వరి ధాన్యం బస్తా రూ.1700 పలికింది. ఇప్పుడు రూ.1350 పలుకుతోంది. క్వింటా కందులు రూ.14వేలు ఉంటే ఇప్పుడు రూ.9వేలు మాత్రమే. ఉల్లి గడ్డలు క్వింటాళ్లు గరిష్టంగా రూ.6వేలు పలికితే, తాజాగా రూ.12వందలు మాత్రమే లభిస్తోంది. టన్ను చీనికాయలు ధర రూ.1లక్ష కూడా పలికింది. తాజాగా రూ.10వేలు పలుకుతోంది. టమోటా ధరలు లేకపోవడంతో రోడ్లుపై పడేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఆందోళన చేస్తుంటే, ఆ కార్యక్రమం చేపట్టరాదని అనేక ఆంక్షలను కూటమి సర్కార్ విధించింది. ప్రజాస్వామ్యబద్ధంగా కార్యక్రమం నిర్వహిస్తున్నా కూటమి సర్కార్ వణికిపోతోందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అందుకే పోలీసుల ద్వారా అణిచివేత చర్యలు చేపట్టిందని ఉదహరిస్తున్నారు.

### పోలీసుల ఆంక్షలు ఛేదించుకొని...

రైతు పోరు కార్యక్రమం నీరు గార్చేందుకు సోమవారం రాత్రి నుంచే పోలీసుల ద్వారా ప్రభుత్వం ప్రయత్నించింది. ముందస్తు నోటీసులు జారీ చేసి, అనుమతులు లేవంటూ నాయకుల్ని కట్టడి చేసే చర్యలు చేపట్టింది. అవేవీ లెక్కపెట్టకుండా రైతుల శ్రేయస్సే ఏజెండాగా జిల్లా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా దిగ్విజయంగా రైతు పోరు కొనసాగించారు. పులివెందులలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి నాయకత్వంలో రైతుపోరు చేపట్టారు. పోలీసులు ఆటంకాలను లెక్కచేయకుండా కొనసాగించారు. జమ్మలమడుగులో ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. కమలాపురంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, సమన్వయకర్త నరేన్ రామాంజులరెడ్డి నాయకత్వంలో రైతుల కోసం నినదించారు. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి నాయకత్వంలో మైదుకూరులో చేపట్టారు. బద్వేల్‌లో ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి నాయకత్వంలో రైతు పోరు కొనసాగించారు. కడపలో మాజీ మంత్రి అంజద్ బాషా నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ కొనసాగించారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నేతృత్వంలో ప్రొద్దుటూరులో రైతు పోరు కొనసాగించారు. ఎద్దుల బండ్ల ర్యాలీ చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.

### వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు



పి. రవీంద్రనాథ్ రెడ్డి, నరేన్ రామాంజులరెడ్డికి నోటీసులు అందజేస్తున్న పోలీసులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం స్మిత్‌రోడ్డులోని రవీంద్రనాథ్‌రెడ్డి నివాసంలో, బీకేఎం వీధిలోని అంజద్‌బాషా నివాసాల వద్ద కెళ్లి పోలీసులు ఈ నోటీసులను అందజేశారు. 30 యాక్టు అమల్లో ఉన్నందున ర్యాలీలు చేయవద్దని, ఎక్కువ మందిని గుమికూడేలా చేయవద్దని, ఉల్లంఘిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు నోటీసులు అందజేస్తున్న పోలీసు



మైదుకూరులో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు



ప్రొద్దుటూరు: అన్నదాత పోరు ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, రైతులు, పార్టీ శ్రేణులు



కడపలో అన్నదాత పోరు ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రైతులు, పార్టీ శ్రేణులు

## న్యూస్‌రీల్

### రైళ్ల స్టాపింగ్‌పై ఉత్తర్వులు

కడప కోటిరెడ్డి సర్కిల్: కరోనాకు ముందు ఉన్న పది రైల్వే స్టేషన్లలో స్టాపింగ్‌లను పునరుద్ధరిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 16351 ఛత్రపతి శివాజీ టర్మినల్ నాగర్ కొయిల్ రైలు రాజంపేట, కోడూరులో ఆగుతుందన్నారు. 16381, 16382 కన్యాకుమారి – పుణే, పుణే – కన్యాకుమారి రైళ్లు నందలూరు, కొండాపురంలో, 17622 తిరుపతి – ఔరంగబాద్ రైలు ఎర్రగుంట్లలో, 17652 కాచిగూడ చెంగల్‌పట్టు రైలు కోడూరులో, 22102 మధురై లోకమాన్య తిలక్ రైలు రాజంపేటలో స్టాపింగ్‌లు ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైల్వే ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### 11 నుంచి ఎంపికలు



మాట్లాడుతున్న డీవీఈఓ వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో మొదటి విడత స్కూల్ గేమ్స్‌కు సంబంధించి ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఎంపికలు నిర్వహించనున్నట్లు కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్– 19 ప్రెసిడెంట్, డీవీఈఓ వెంకటేశ్వర్లు, కడప జిల్లా అండర్ 19 సెక్రటరీ చంద్రమోహన్ రాజు తెలిపారు. నియమ నిబంధనల ప్రకారం ఎంపికలు పక్కాగా ఉండాలని తెలిపారు. అర్హులను గుర్తించి ఎంపికలకు హాజరయ్యేనట్లు జిల్లాకు సంబంధించిన అందరూ వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు చూడాలన్నారు. అర్హులైన విద్యార్థులందరిని ఉమ్మడి కడప జిల్లాలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ , వ్యాయామ ఉపాధ్యాయులు సంబంధిత షెడ్యూల్ ప్రకారము తమ క్రీడాకారులను అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని వారు సూచించారు.

## బీసీ మున్సిపల్ చైర్‌పర్సన్ అని చులకనా!



మంగళవారం రాత్రి కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వని కమిషనర్
- ఎమ్మెల్యే వరద వెంట వెళ్లడంతో బైఠాయించిన కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు: గత నెలలో ఎందుకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు..? తాను సమావేశం పెట్టాలని సమాచారం పంపినా ఎందుకు స్పందించలేదు.. అంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని ప్రశ్నించారు. తాను బీసీ మున్సిపల్ చైర్‌పర్సన్ అని చులకనగా చూస్తున్నారా? అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించారు. గత నెలలో సాధారణ సమావేశం నిర్వహించాలని, తర్వాత అత్యావసర సమావేశం నిర్వహించాలని వాట్సాప్‌లో మెసేజ్ పెట్టానని, సిబ్బంది ద్వారా సమాచారం అందించానని చైర్‌పర్సన్ తెలిపారు. అయినా ఎందుకు స్పందించలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. కమిషనర్ వాట్సాప్ మెసేజ్ కూడా తీసుకున్నారని చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. దీనిపై కమిషనర్ ఎంతకూ స్పందించకపోవడంతో పోడియం వద్ద వైఎస్సార్‌సీపీ మహిళా కౌన్సిలర్లు బైఠాయించారు. చైర్‌పర్సన్‌కు సమాధానం ఇవ్వకపోవడం అంటే చైర్‌పర్సన్‌ను అవమానించినట్లేనని వైఎస్సార్‌సీపీ సభ్యులు తెలిపారు. ఎక్స్ అఫిసియో సభ్యుని హోదాలో హాజరైన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కమిషనర్ సారీ చెప్పాల్సిన అవసరం లేదని, జవాబు ఇవ్వాల్సిన పనిలేదన్నారు. మీరు ఏదైనా ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలే కానీ అడ్డుకోవడం తగదన్నారు. 'కమిషనర్లు.. ప్రతి కౌన్సిలర్‌కు జవాబుదారీతనంగా ఉండాలని.. గతంలో మీరు చెప్పిన సూచనలు ఏమయ్యాయని వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని సూటిగా ప్రశ్నించారు. సుమారు అరగంటకుపైగా సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, సభ్యులకు సమాధానం ఇవ్వకుండానే కమిషనర్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వెంట సమావేశం నుంచి వెళ్లిపోయారు. తిరిగి సమావేశం నిర్వహించే వరకు తాము ఇక్కడే కూర్చుంటామని చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్లు, సభ్యులు సమావేశ మందిరంలోనే నిరసన తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్డీడీకి ఫోన్‌లో కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. ఉద్దేశ పూర్వకంగానే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎగ్జిబిషన్ వేలం పాట నిర్వహించకూడదని, మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా జాప్యం చేశారని వైస్ చైర్మన్లు ఆరోపించారు. కొత్తపల్లె పంచాయతీ పరిధిలో టీడీపీ వర్గీయులు కొత్తగా ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్నారని, అందుకోసమే మున్సిపాలిటీలో ఎగ్జిబిషన్ నిర్వహించకుండా వాయిదా వేస్తారా అని ప్రశ్నించారు.

### రాత్రంతా కౌన్సిల్ హాల్‌లోనే...

ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజాతోపాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మంగళవారం రాత్రంతా గడిపారు. ఈ విషయమై చైర్‌పర్సన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తాము మీటింగ్ హాల్లోనే ఉన్నామని.. అజెండా ప్రకారం సమావేశం నిర్వహించాలని కమిషనర్‌కు తెలిపారు.

## యూరియాపై ఆందోళన వద్దు

- బ్లాక్ మార్కెట్ చేస్తే చర్యలు
- కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో లక్ష ఎకరాలకు సరిపడ యూరియా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో రైతులకు 12500 టన్నుల యూరియా అందజేశామన్నారు. మూడు రోజులుగా 1100 టన్నులు అందజేశామని, ఈ రోజు 150 టన్నులు పంపిణీ చేశామన్నారు. రానున్న రోజుల్లో 600–700 టన్నుల యూరియా జిల్లాకు రానుందని వెల్లడించారు. ఇప్పటికి 3.70లక్షల బస్తాల యూరియా తీసుకున్నారని తెలిపారు. ప్రైవేటు డీలర్లు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కేసులు పెడుతున్నామన్నారు. యూరియా కేవలం నత్రజనిని మాత్రమే ఇస్తుందని.. ఎక్కువ వాడితే పంటకు నష్టం కలుగుతుందని చెప్పారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**ఉల్లి ఎంతైనా కొంటాం:** జిల్లాలో పదివేల ఎకరాల్లో ఉల్లిపంట సాగుచేశారని, రెండు రోజుల నుంచే కొత ప్రారంభమైందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 22, 23 తేదీల నుంచి పంట మార్కెట్‌కు వస్తుందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కిలో రూ.12ల చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లాలో చీని రైతులు 80 శాతం మంది ఇప్పటికే పంట అమ్ముకున్నారన్నారు. మార్కెట్‌లో వేలం నిర్వహించే సమయంలో బాగా గ్రేడింగ్ చేసి తీసుకురావాలని సూచించారు.

### డీలర్లు, గోడౌన్లపై దాడులు: ఎస్పీ

పోలీసు, విజిలెన్స్, అగ్రికల్చర్ అధికారులతో కలిసి ఎరువుల డీలర్లు, గోడౌన్లపై దాడులు నిర్వహిస్తున్నామని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తెలిపారు. సరైన అకౌంట్స్ లేకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేసినా చర్యలు తప్పవన్నారు.

**అది ఇప్పటి వీడియో కాదు**

పులివెందులకు చెందిన ఉస్మాన్ ఖాన్ అనే వ్యక్తి హిందూ దేవతలను దూషిస్తూ పెట్టిన వీడియో ఇప్పటిది కాదని, అది 2022లో పెట్టినదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. అందుకు క్షమాపణ చెబుతూ అప్పట్లోనే ఆ వ్యక్తి ఓ వీడియో చేశారన్నారు. అది ఇప్పటి వీడియో అని భ్రమపడి వీహెచ్‌పీ కార్యకర్తలు ఆయన ఇంటిపైకి కొట్టడానికి పోయారన్నారు. అతనికి సరిపోని వ్యక్తులు ఎవరో మళ్లీ పాత వీడియోను రీసర్క్యులేట్ చేశారన్నారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## వసతి గృహాన్ని తనిఖీ చేసిన మంత్రి

ఎర్రగుంట్ల: మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో ఉన్న ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ మొత్తం తిరిగి బిల్డింగ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, ఆరోగ్యం, ఆహారం తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోట్లదుర్తిలోని వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

# జాతీయ స్థాయి పోటీలకు 'భారతి' విద్యార్థులు


విజేతలతో పరిశ్రమ ప్రతినిధులు, ప్రిన్సిపల్

**కమలాపురం :** మండల పరిధిలోని నల్లలింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) లోని డీఏవీ భారతి విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివ్యామ్ కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం పరిశ్రమ ప్రతినిధులతో కలసి ఆయన విజేతల వివరాలు వెల్లడించారు. ఇటీవల విజయ నగరం జిల్లాలోని రాజాం సీఎంఆర్ డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన డీఏవీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో ఎన్‌వీ కార్తిక్‌రెడ్డి ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే 400 మీ. పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచాడు. జావెలిన్ త్రోలో ఎం. షారూన్ కుమార్ తృతీయ స్థానంలో, 4×400 మీటర్ల పరుగు పందెంలో నరేష్, కార్తీక్, భార్గవ్, షారూన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్–17 బాలికల విభాగంలో వైశాలి ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. జావలిన్ త్రోలో విహారిక ద్వితీయ స్థానంతో పాటు 400మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచింది. అండర్–14బాలికల విభాగంలో ట్రిపుల్ జంప్‌లో అక్షిత ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో కేవీ రుషి జావెలిన్ త్రోలో తృతీయ స్థానంలో నిలిచాడు. కాగా విజేతలుగా నిలిచిన వారిలో కార్తిక్ రెడ్డి (ట్రిపుల్ జంప్), వైశాలి (ట్రిపుల్ జంప్), విహారిక (జావెలిన్ త్రో), అక్షిత(ట్రిపుల్ జంప్) లు త్వరలో జరగబోయే డీఏవీ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కాగా విజేతలుగా నిలిచిన వారిని పరిశ్రమ సీఎంఓ సాయి రమేష్ ,ప్రతినిధులు గోపాల్‌రెడ్డి, భార్గవ్ రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రిలు అభినందించారు.





# కూలిపోయిన బతుకులు

- మించిలివారికోట వద్ద ఆటో బోల్తా
- వైఎస్సార్ కడపకు చెందిన ఇద్దరు కూలీలు మృతి


మృతి చెందిన కూలీ హేమలత


మృతి చెందిన దేవనాథ

**తనకల్లు/ వేంపల్లె :** వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు. కూలి కాస్త ఎక్కువగా వస్తుందన్న ఆశతో జిల్లాదాటి వచ్చారు. రోజంతా టమాట తొలగింపు పనుల్లో అలసిపోయారు. సూర్యుడు అస్తమించే వేళ ఆ రోజు అందిన కూలి తీసుకుని స్వగ్రామాలకు ఆటోలో పయనమయ్యారు. ఇంట్లో బిడ్డల గురించి ఒకరు, భార్య ఆరోగ్యం గురించి మరొకరు ఇలా ఆలోచిస్తూ వెళ్తున్నారు. కానీ ఆటో బోల్తా పడగా వారి జీవితాలు అక్కడే ముగిసిపోయాయి. కూలీలతో వెళ్తున్న ఓ ఆటో మండలం పరిధిలోని కొక్కంటి సమీపంలోని మించిలవారికోట రోడ్డు వద్ద బోల్తా పడడంతో వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలానికి చెందిన వ్యసాయ కూలీలు పట్టా దేవనాథ్ (45), బత్తల హేమలత (32) మృతి చెందారు.

**తిరిగి వెళ్తూ.. తిరగిరాని లోకాలకు**
వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలం కొండప్పగారిపల్లి, ఆంజనేయపురం, బురుజుపల్లి గ్రామాలకు చెందిన పలువురు వ్యవసాయ కూలీలు మంగళవారం ఉదయం ఆటోలో శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని అగ్రహారంపల్లికి చెందిన ఓ రైతు పొలంలో టమాట కోసేందుకు వచ్చారు. పని ముగిసిన అనంతరం అదే ఆటోలో స్వగ్రామాలకు బయలుదేరారు. అయితే మించిలివారికోట రోడ్డు వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపు తప్పడంతో రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బత్తల హేమలతకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదే ఆటోలో ప్రయాణిస్తున్న బూరుజుపల్లికి చెందిన పట్టా దేవనాథ్, పట్టా బయన్న, శివగంగ, కొండప్పగారిపల్లికి చెందిన పెద్ద గంగులయ్య, బురుజుపల్లికి చెందిన పట్టా బయప్ప, గాయపడ్డారు. షయం తెలుసుకున్న 'వందేమాతరం టీం' సభ్యులు బాగేపల్లి అశోక్, బాలు, నవీన్, తండేల్ తదితరులు క్షతగాత్రులను తమ ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పుట్టా దేవనాథ్ మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ గోపి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బత్తల హేమలతకు భర్త రామాంజనేయులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి శివగంగ, బేబీ, గణేష్‌లు అనే ముగ్గురు పిల్లలు ఉండగా తల్లి వెంట కుమార్తె శివగంగ కూడా కూలి పనులకు వెళ్లింది. శివగంగకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు దేవనాథ్‌కు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు బయప్ప, బయన్నలు ఉన్నారు. వీరు డిగ్రీ, ఇంటర్ చదువుకుంటున్నారు, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కూలీలు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

# కేఎస్ఆర్ ట్రావెల్స్ కార్యాలయంపై దాడి

బస్సు అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం


కేఎస్ఆర్ ట్రావెల్స్ కార్యాలయ ఫర్నీచర్‌ను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

**పులివెందుల :** పులివెందుల పట్టణంలోని శ్రీరామ హాలు రోడ్డులో ఉన్న కేఎస్ఆర్ ట్రావెల్స్ కార్యాలయంపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ట్రావెల్స్ ఎదురుగా కారు పార్కింగ్ చేయడంతో ట్రావెల్స్‌లో పనిచేసే వ్యక్తి కారును పక్కకు తీయాలని బస్సు వస్తుందని తెలపడంతో మాట, మాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తులైన కారులో ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు ట్రావెల్స్‌లో పనిచేసే వ్యక్తిపై దాడికి పాల్పడటంతోపాటు ట్రావెల్స్‌లో ఉన్న ఫర్నీచర్, బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ సంఘటనతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సీఐ సీతారామి రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన ప్రసాద్, శ్రీను, ప్రొద్దుటూరు ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎర్రగుంట్ల :** మండల పరిధిలోని చిలంకూరు గ్రామ పరిధిలోని సిర్రాజుపల్లి రోడ్డులో జేసీబీ యంత్రం పనులు చేస్తుండగా అదే మార్గంలో పోతున్న బైక్‌ను ఢీకొన్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైకుపై పోతున్న మల్లికప్రసాద్ (40), యర్రగుళ్ల శ్రీను, శివశంకర్‌లకు గాయాలయ్యాయి. వీరిలో మల్లికప్రసాద్‌కు తీవ్ర గాయాలుకాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం యర్రగుంట్ల పట్టణ సీఐ విశ్వనాథ్‌రెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... సిర్రాజుపల్లి గ్రామానికి చెందిన మల్లికప్రసాద్, దండుపల్లి గ్రామానికి చెందిన యర్రగుళ్ల శ్రీను, శివశంకర్‌లు ముగ్గురు సిర్రాజుపల్లి రోడ్డు నుంచి బైక్‌లో చిలంకూరుకు బయలుదేరారు. చిలంకూరు గ్రామ సమీపంలోని స్మశానవాటిక వద్దకు రాగానే జేసీబీ రోడ్డుకు అనుకుని పనులు చేస్తోంది. జేసీబీ ఆపరేటర్ ముందు భాగాన పనులు చేస్తుండగా వెనుక భాగాన ఉన్న జేసీబీ పళ్ల తొట్టి రోడ్డుకు దగ్గరలో ఉంది. అదే సమయంలో బైక్‌పైన ప్రసాద్, శ్రీను, శివశంకర్‌లు పోతుండుగా జేసీబీ తొట్టి తగిలింది. దీంతో బైక్‌పై ఉన్న ప్రసాద్ ఎగిరి తొట్టికి ఉన్న ఇనుప పళ్ల మధ్య ఇరుక్కోవడంతో ఇనుప పళ్లు ప్రసాద్ ఛాతీపై దిగింది. మిగిలిన ఇద్దరు శ్రీను, శివశంకర్ స్వల్పగాయాలతో బయట పడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే మాజీ ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ముగ్గురికి ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రసాద్ పరిస్థితి విషమించడంతో కర్నూల్ కు తరలించారు. అక్కడ నుంచి హైదరాబాదుకు తరలించినట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని సీఐ విశ్వనాథ్‌రెడ్డి పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


చెన్నూర్ ఫయాజ్ మృతదేహం

**ఎర్రగుంట్ల :** యర్రగుంట్ల మండలం పోట్లదుర్తి పరిధిలోని పెన్నానదిలో గల్లంతు అయిన చెన్నూర్ ఫయాజ్ మృత దేహం లభించిందని యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన చెన్నూర్ ఫయాజ్‌తో పాటు మరికొంత మంది యువకులు సోమవారం సాయంత్రం చేపలు పట్టడానికి పెన్నానది వద్దకు వెళ్లారు. అయితే చేపలు పడుతున్న సమయంలో చెన్నూరు ఫయాజ్ (25) అనే వ్యక్తి ప్రమాదశాత్తు నదిలో పడి గల్లంతు అయ్యాడు. సమాచారం అందిన వెంటనే పోలీస్, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా బోటు సాయంతో సోమవారం రాత్రింతా గాలించారు. మంగళవారం ఉదయం కూడా బోటు సాయంతో పెన్నానది నీటి ప్రవహం వెంబడి గాలింపు చేశారు. హనుమనుగుత్తి గ్రామ సమీయంలో దడికి ఫయాజ్ మృతదేహం ఉండటం అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది గుర్తించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## ఎరువు కోసం వెళ్లి వస్తుండగా..

– లారీ ఢీ కొని రైతు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మిరెడ్డి

**చాపాడు :** మైదుకూరు–ప్రొద్దుటూరు ప్రధాన రహదారిలో గల మండల పరిధిలోని ఆనంద ఆశ్రమం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమాపురం గ్రామానికి చెందిన లెక్కల లక్ష్మిరెడ్డి (65) అనే రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. లక్ష్మిరెడ్డి ఎరువుల కోసం మైదుకూరుకు వెళ్లి తిరిగి గ్రామానికి ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాత్రి 8 గంటల ప్రాంతంలో సోమాపురం క్రాస్ రోడ్డు దాటుతుండగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నుండి ప్రొద్దుటూరుకు వెళుతున్న వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మిరెడ్డి తలకు తీవ్ర గాయం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో మోటార్ సైకిల్ నిప్పంటుకుని కాలిపోయింది. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు సంఘటన స్థాలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల జాతీయ రహదారిని విస్తరణ చేసి ఫ్లెఓవర్ బ్రిడ్జి నిర్మించడం వలన సోమాపురం వెళ్లే గ్రామస్తులు రోడ్డు దాటుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ అధికారులు చర్యలు తీసుకుని తగిన జాగ్రత్తలు ఏర్పాట్లు చేయాలని కోరుకుంటున్నారు.

## టిప్పర్ ఢీ కొని వ్యక్తి మృతి


టిప్పర్ కింద నుజ్జు నుజ్జు అయిన బైక్

**ఖాజీపేట :** జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కె. సుబ్బయ్య (48) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే చాపాడు మండలం నాగసానిపల్లె గ్రామం వద్ద ఉన్న గుట్ట నుంచి మట్టిని టిప్పర్ ద్వారా తరలిస్తున్నారు. అందులో భాగంగా అల్లాడు పల్లె నుంచి ఖాజీపేట మండల పరిధిలోని జాతీయ రహదారి అయ్యప్ప స్వామి గుడి దగ్గరకు రాగానే ముందు వెళుతున్న బైక్‌ను టిప్పర్ ఢీ కొంది. దీంతో బైక్ పై ఉన్న సుబ్బయ్య రోడ్డు నుంచి కాలువలో పడ్డాడు. కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖాజీపేట పోలీసులు అక్కడికి చేరుకుని చనిపోయిన వ్యక్తిని కడప రిమ్స్ లోని మార్చురీకి తరలించారు. చనిపోయిన వ్యక్తిది ప్రొద్దుటూరు గా గుర్తించారు. ఆమేరకు టిప్పర్ డ్రైవర్ జహంగీర్ ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

## పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

**కడప అర్బన్ :** ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం కు పాల్పడిన రౌడీ షీటర్ రాజ్‌కుమార్ పై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ తులసి నాగ ప్రసాద్ తెలిపారు. తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ రాజ్ కుమార్ ఈనెల ఏడో తేదీన ఐదేళ్ల చిన్నారిని చాక్లెట్ ఇచ్చి తన ఇంట్లో ఎత్తుకుని వెళ్లి అత్యాచారయత్నం కు పాల్పడే ప్రయత్నం చేశాడని తెలిపారు. ఈకేసుకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

## తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం

– టపాసులు పడి బోదకొట్టం దగ్ధం


టపాసులు బోదకొట్టంపై పడటంతో అగ్నికి ఆహుతవుతున్న దృశ్యం

**వీరబల్లి :** మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కరిముల్లా అనే వ్యక్తి బోదకొట్టం నిర్మించుకొని టీ అమ్ముకొని జీవనం సాగించేవాడు. మంగళవారం రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌చార్జ్ పదవి చేపట్టిన జగన్ మోహన్ రాజు మొట్టమొదటి సారిగా మండలానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండ్‌లో తెలుగు తమ్ముళ్లు అత్యుత్సాహంతో టపాసులు కాల్చడంతో అవి ఆ బోదకొట్టంపై పడి పూర్తిగా కాలిపోయింది. దీంతో కరీముల్లా కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో నిరుత్సాహంగా ఉండిపోయింది. కరీముల్లా ఇటీవల వేలు ఖర్చుచేసి బోదకొట్టం ఏర్పాటు చేసుకున్నాడు.

## పోక్సో కేసు నమోదు

**చాపాడు :** మండల పరిధిలోని నెర్రవాడ గ్రామానికి చెందిన కదిరేపల్లె విష్ణువర్ధన్ అనే యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. నిందితుడు బద్రిపల్లె గ్రామానికి చెందిన ఒక యువతితో ఫోన్‌లో మాట్లాడేవాడన్నారు. 7వ తేదీ తెల్లవారుజామున 2.30 సమయంలో అమ్మాయి ఇంటి వద్దకు వెళ్లి బయటికి వచ్చి మాట్లాడాలని బలవంతం చేశాడన్నారు. యువతి చేయిపట్టుకొని లాగాడన్నారు. బాధితురాలు విషయాన్ని తండ్రికి తెలపడంతో ఆయన ఇంటి బయటకు వెళ్లి చూడగా నిందితుడు పరారయ్యాడన్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

## మహిళ అదృశ్యం


మహబూబ్ బీ

**కమలాపురం :** ఎర్రగుంట్ల టౌన్ రాణి వనం, ఎస్‌బీఐకు ఎదురుగా నివాసం ఉంటున్న పఠాన్ మహబూబ్ బీ (48) కమలాపురంలో మిస్ అయిందని ఎస్‌ఐ విద్యా సాగర్ తెలిపారు. ఆమె ఈ నెల 7వ తేదీన బంధువులతో కలసి కమలాపురం వచ్చి తప్పి పోయినట్లు ఆయన తెలిపారు. అప్పటి నుంచి ఆమె కనిపించలేదని, కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆమెకు మాటలు రావని, అలాగే మతి స్థిమితం సరిగా ఉండదని ఆయన తెలిపారు. ఎక్కడైనా ఈ మహిళ కనిపిస్తే కమలాపురం పోలీసులకు 91211 00532 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

## కారు బోల్తా



**కాశినాయన :** మండలంలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతికి వెళ్లే మార్గంలో మంగళవారం కారు అదుపు తప్పి రెండు పల్టీలు కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారని స్థానికులు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి ఉన్నారని స్థానికులు పేర్కొన్నారు.

# సాగు భూముల్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న బీజేపీ

వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయ రాఘవన్



జెండాను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** సాగు భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడంతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షులు విజయ రాఘవన్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని హరిత హోటల్ ఆవరణంలో జాతీయ సమావేశాలు ప్రారంభ సూచిక సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ పంపిణీ సాగునీరు ఉపాధి హామీకై వ్యవసాయ కార్మికులు ఉద్యమించి పోరాడాలని పిలుపునిచ్చారు. విదేశీ పెట్టుబడులపై ఆధారపడి ఊహాజనితమైన పథకాలతో భూములు సేకరించి వ్యవసాయాన్ని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నదని, రైతుల్ని వ్యవసాయ కూలీలను అభద్రతకు భయభ్రాంతులకు పాలకులు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. బలవంతపు భూ సేకరణ వల్ల అభివృద్ధి జరగలేదని దీనివల్ల లక్షలాది రైతులు కూలీలు వృత్తిదారుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. నేడు నూతన ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగం మొత్తం దివాలా తీస్తోందని, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున వలస బాట పడుతున్నారని, సన్న ,చిన్నకారు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఇవి ఏమాత్రం పట్టడం లేదన్నారు. ఈ సమావేశంలో అఖిలభారత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి విజు కృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి వెంకట్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దడాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు జి చంద్రశేఖర్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి బి మనోహర్, జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు రెడ్డి, జిల్లా నాయకులు ఏ రామ్మోహన్ పాల్గొన్నారు.

**వ్యవసాయ రంగ సంక్షోభం పుస్తకం ఆవిష్కరణ**
అఖిల భారత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్ ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన కార్పొరేట్ల కబంధ హస్తాల్లో వ్యవసాయ రంగం పుస్తకాన్ని మంగళవారం కడప హరిత హోటల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# దొరికింది ఎంత.. దాచింది ఎంత?

- గ్యాంబ్లింగ్ సంఘటనలో అనుమానాలు ఎన్నో
- 22 మంది పేకాటరాయుళ్లు అదుపులోకి..
- రూ. 11,83,940 నగదు స్వాధీనం


మాట్లాడుతున్న సీఐ నరేష్ బాబు

**జమ్మలమడుగు రూరల్ :** జమ్మలమడుగు మండల పరిధిలోని గండికోట– దప్పెర్ల రహదారిలో ముళ్ల పొదల్లో భారీ ఎత్తున పేకాట ఆడుతున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌కు అజ్ఞాత వ్యక్తులు సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు జమ్మలమడుగు పట్టణ సీఐ నరేష్‌బాబు ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బందితో కలసి దాడులు చేసి వివిధ ప్రాంతాలకు చెందిన 22 మందిని పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. కాగా వారి వద్ద నుంచి విశ్వసనీయ సమాచారం మేరకు సుమారు రూ. 80 లక్షల రూపాయలు మేరకు పట్టుబడినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు విచారిస్తే అసలు విషయం తెలుస్తుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**సీఐ నరేష్ బాబు విలేకరులతో మాట్లాడుతూ..**
సీఐ నరేష్ బాబు మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గండికోట– దప్పెర్ల రోడ్డు మార్గంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి 7వ తేదీ దాడి నిర్వహించి 22 మంది పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ. 11, 83, 940 స్వాధీనం చేసుకుని నోటీసులు ఇచ్చి పంపామన్నారు. కాగా.. మండలపరిధిలోని చిటిమిటి చింతలలో ఈ నెల 7వ తేదీ పేకాట ఆడుతూ పట్టుబడిన 22 మంది మంగళవారం కొలిమిగుండ్ల మండలం అవుకు నుండి 15 లీటర్ల నాటు సారా తెచ్చుకుని గ్రామ సమీపంలో తాగుతున్నట్లు సమాచారం రావడంతో వారిని అదుపులోకి తీసుకోని కోర్టుకు హాజరు పరిచామని.. కోర్టు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్న డబ్బు విషయం ఎంత అనే దానిపై చర్చలు సాగుతున్నాయి.

## జూదరుల అరెస్ట్

**కడప అర్బన్ :** కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉక్కాయపల్లె దిబ్బల సమీపంలో జూదమాడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.. వారి వద్ద నుంచి రూ. 75వేలు నగదుతో పాటు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.